


వివేకనగర్‌లో అన్నపూర్ణదేవిగా భువనేశ్వరిదేవి, దుర్గ నల్లపోచమ్మ



రాంనగర్ జెమినికాలనీలో దుర్గామాత పూజలో బీఆర్ఎస్ నేత నాగేష్‌ముదిరాజ్, బీజేపీ నేత పూస రాజు



కవాడిగూడ బస్తీ పూజలో ఏడీసీపీ ఆనంద్, ఇన్‌స్పెక్టర్ రాజు, శ్రీనివాస్



చిక్కడపల్లి శక్తిసేన యూత్ అసోసియేషన్ మండపంలో పూజలు

నవరాత్రి పూజ.. ఆధ్యాత్మిక శోభ

భక్తులతో పోటెత్తిన అమ్మవారి దేవాలయాలు

- శంకరమఠంలో ఇంద్రాణిగా శారదాంబ
- న్యూరామాలయంలో 'అన్న పూర్ణాదేవి'గా జ్ఞాన సరస్వతి

నల్లకుంట: నగరంలోని దారులన్నీ నల్లకుంట శంకరమఠానికి సాగుతున్నాయి. శంకరమఠం పరిసరాలన్నీ భక్తుల శరణు ఘోషతో మార్మోగుతున్నాయి. అమ్మను భక్తులు కనులారా దర్శించుకుని తరిస్తున్నారు. శారదా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఐదో రోజు అమ్మవారు 'ఇంద్రాణి'గా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పూలమాలలు, బంగారు ఆభరణాలతో అలంకరించి కుంకుమార్చనలు, స్వర్ణ కమల పూజ, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు. ముందుగా శక్తి గణపతికి తొలి పూజలు నిర్వహించి, చంద్రమౌళీశ్వరస్వామికి విశేష పూజలు కావించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం అద్వైతసిద్ధి రత్నాకర్త శాస్త్రనిధి బ్రహ్మశ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యం 'దేవీ భాగవతము'పై ఇచ్చిన ప్రవచనాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. అలాగే గీతా గణేశ్ యూఈపీఏ విద్యార్థుల బృందం ప్రదర్శించిన నృత్యాంజలి ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది.

నేడు 'గజలక్ష్మి'అలంకరణ..

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆరో రోజైన మంగళవారం శారదాంబ అమ్మవారు 'గజలక్ష్మి'అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని శంకరమఠం నల్లకుంట శాఖ హెడ్ కె.కృష్ణారావు తెలిపారు. అలాగే సాయంత్రం కొమరవోలు శివప్రసాద్ బృందంచే గళ మురళీ విన్యాసం ఉంటుందని చెప్పారు.

అన్న పూర్ణే సదా పూర్ణే..

న్యూ నల్లకుంటలోని న్యూ రామాలయంలో జ్ఞాన సరస్వతి మాత 'అన్నపూర్ణా దేవి'అలంకరణలో దర్శనమిచ్చి భక్తులకు కనువిందు చేశారు. ఈ సందర్భంగా ఉదయం ఉపనిషత్ పూర్వక అభిషేకము కావించారు. అనంతరం అక్కడి యాగశాలలో చండీ హోమము నిర్వహించి, నవదాన్యాలు, సుగ్రద ద్రవ్యాలు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి కావించారు. భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ కావించారు. ఆలయ ధర్మకర్తల కమిటీ చైర్మన్ జమలాపురం గోపాల్‌రావు, ధర్మకర్తలు ఎస్.వెంకటేశ్వరరావు, ఎ. మధుకుమార్, వై.మురళీ మధుసూదన్, ఎ.మురళీకృష్ణ, కె మంజుల అమ్మవారి పూజలో పాల్గొన్నారు.



బాపూజీనగర్‌లో అమ్మవారికి పూజలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్



జెమినికాలనీ పోచమ్మ దేవాలయ అన్నదాన కార్యక్రమంలో అభిషేక్‌రెడ్డి



చిక్కడపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు



న్యూరామాలయంలో అన్నపూర్ణాదేవి పూజలో పాల్గొన్న ఆలయ ధర్మకర్తలు



అమ్మవారి మండపం వద్ద మహిళా భక్త బృందం లలితా, విష్ణుపారాయణాలు చేస్తున్న భక్తులు



ఇంద్రాణి అలంకరణలో శారదాంబ



బాపూనగర్ ఈ-సేవా వద్ద సీతారామా యువ బృందం మండపంలో మాజీ కార్పొరేటర్ వీఎస్ఆర్, ప్రీతమ్, సిరిగిరిశ్యామ్, అమిత్



చిక్కడపల్లిలో నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ మండపంలో కాత్యాయనిదేవిగా అమ్మవారు



దోమలగూడలోని బాలాత్రిపురాసుందరీదేవి ఆలయంలో చండీ హోమంలో పాల్గొన్న కార్పొరేటర్ జి. రచనశ్రీ



రాంనగర్ డివిజన్ పోచమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నూతన కార్యవర్గం ఏర్పాటు



జిల్లా నూతన అధ్యక్షుడు కొండల్



నూతన కార్యదర్శి కొలా స్వప్న

ముషీరాబాద్: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల జనరల్ కౌన్సిల్ సమావేశం విద్యానగర్‌లోని సీపీ భవన్‌లో సోమవారం జరిగింది. ఈ జనరల్ కౌన్సిల్‌కు ముఖ్య వక్తగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వేణు హాజరై మాట్లాడారు. కల కోసం కాదని ప్రజల కోసం అంటూ గత 50 ఏళ్లుగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య పనిచేస్తోందని అన్నారు. జనరల్ కౌన్సిల్ సమావేశం అక్టోబర్ 20న వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో జరుపుతున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కొండల్, కోలా స్వప్న ఏకగ్రీవంగా ఎన్నిక కాగా కమిటీ సభ్యులుగా పుణ్యవతి, జయసుధ, భారతి తదితరులు నియమితులయారు.

చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవం



చిక్కడపల్లి: చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం సంఘం కార్యాలయంలో నూతన అధ్యక్షుడిగా చేపూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా పల్లెర్ల రమేష్, కోశాధికారిగా తొడుపునూరు రవీందర్ తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను మరింత పెంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు సింగారపు రమేశ్‌గుప్తా, సంఘం నాయకులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం...గుర్తుతెలియని వ్యక్తి (65) కాచిగూడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం నెంబర్ 3పైన మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో 4తులాల మంగళసూత్రం చోరీ

కాచిగూడ: మహిళ మెడలోని 4 తులాల బంగారు మంగళసూత్రం చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం .... నెల్లూరుకు చెందిన ఫణికుమార్ తన భార్య వెంకట పద్మావతితో కలిసి ఆదివారం నాగర్‌సోల్ నుంచి అజంతా ఎక్స్‌ప్రెస్‌లో కాచిగూడకు వస్తున్నారు. రైలు ఉమ్రి రైల్వే స్టేషన్ వద్ద ఉండగా ఆమె మెడలోని 4 తులాల బంగారు మంగళ సూత్రాన్ని గుర్తుతెలియని వ్యక్తి లాక్కుని పారిపోయాడు. సోమవారం బాధితురాలు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

మరో ఘటనలో 7 గ్రాముల బంగారు గొలుసు చోరీ..

మహిళ మెడలోని గొలుసు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని వెస్ట్ మారేడ్‌పల్లికి చెందిన అరుణ్ సెంగర్ తన భార్య సలోని చౌహాన్‌తో కలిసి ఆదివారం ఉజ్జయిని నుంచి కాచిగూడకు జైపూర్ - కర్నూల్ రైలులో వస్తున్నారు. రైలు ఉమ్రి రైల్వే స్టేషన్ వద్ద ఉండగా అమె మెడలోని 7 గ్రాముల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కుని పారిపోయాడు. కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీసులకు బదిలి చేశారు.

వ్యక్తి అదృశ్యం



వెంకటేశ్వర్లు (ఫైల్)

నల్లకుంట: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్సై జె. శ్రీనివాస్ రావు తెలిపిన వివరాలు.. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న వై. వెంకటేశ్వర్లు(58) కుటుంబ సభ్యులతో కలిసి న్యూనల్లకుంట రాఘవేంద్ర హోటల్ సమీపంలో నివాసముంటున్నాడు. ఈనెల 5వ తేదీన సాయంత్రం 4గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి వెంకటేశ్వర్లు తిరిగి రాలేదు. రాత్రి 9.30 గంలకు భార్య సువర్ణ అతడికి ఫోన్ చేయగా తాను తిరుపతికి వెళుతున్నాను అని చెప్పాడు. 6వ తేదీన మరోసారి భర్తకు ఫోన్ చేయగా మరో గంటలో తిరుపతికి చేరుకుంటానని చెప్పి కాల్ కట్ చేశాడు. ఆ తర్వాత మళ్లీ ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆందోళన చెందిన ఆమె సోమవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలి

సీఐటీయూ జాతీయ, రాష్ట్ర కార్యదర్శులు కరిమలన్, వెంకటేష్



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లేబర్ ఆఫీస్ ఎదుట మాట్లాడుతున్న కరిమలన్

చిక్కడపల్లి: నాలుగు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట సోమవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరిమలన్, రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేష్ మాట్లాడుతూ.. మెడికల్ అండ్ సెల్స్ రిప్రజెంటేటివ్స్‌కు చట్టబద్ధమైన పని పద్ధతులను కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎమ్ఆర్ఏఐ సంయుక్త కార్యదర్శి కే.సునీల్‌కుమార్ టీఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ భాను కిరణ్, సంయుక్త ప్రధాన కార్యదర్శి ఏ.నాగేశ్వర్‌రావు, సంఘం ఉపాధ్యక్షుడు ఐ.రాజుబట్, ధర్నాలో వందలాది మంది మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చి ధర్నాలో పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నుంచి నాగేశ్వర్‌రావు, స్వాతి, సుమంత్ బహిష్కరణ

ముషీరాబాద్: పీడీఎస్‌యూ నుంచి ఎస్.నాగేశ్వర్‌రావు, స్వాతి, సుమంత్‌లను బహిష్కరిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కొన్ని నెలలుగా సంఘ కార్యక్రమాలకు దూరంగా ఉంటూన్న వీరిని చురుకుగా పాల్గొనాలని నాయకులు పలు దఫాలుగా ఆహ్వానించారు. అయినప్పటికీ వారి సూచనలను పరిగణలోకి తీసుకోకుండా పీడీఎస్‌యూ పోటీ కార్యక్రమాలు చేస్తూ సంఘ నిర్మాణ విచ్ఛినానికి పాల్పడుతున్నారని అన్నారు. పీడీఎస్‌యూ కార్యాలయం పేరుతో కరపత్రాలు, విజిటింగ్ కార్డులు ప్రింట్ చేసుకొని వ్యక్తిగత స్వలాభం కోసం చలామణి అవుతున్నారని తెలిపారు. పీడీఎస్‌యూ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వీరిని పీడీఎస్‌యూ అన్ని స్థాయి బాధ్యతల నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో పీడీఎస్‌యూకు వీరికి ఎలాంటి సంబంధం లేదన్నారు.

డా. అనూహ్యారెడ్డికి 'బిజినెస్ మావెరిక్ అవార్డు'



కాచిగూడ: వ్యాపారవేత్త డాక్టర్ అనూహ్యారెడ్డికి ప్రతిష్టాత్మకమైన 'బిజినెస్ మావెరిక్ అవార్డు'దక్కింది. ఆక్స్‌ఫర్డ్ లార్డ్ మేయర్ మైక్ రోలీ ఆమెకు ఈ అవార్డు ప్రదానం చేశారు. లండన్ వేదికపై నగర కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటిన అనూహ్యారెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

లిబర్టీ: రాజ్యాంగం ప్రకారం ఎస్సీ వర్గీకరణ చె ల్లదని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ స్పష్టం చేశారు. రాజ్యాంగ విరుద్ధమైన సుప్రీంకోర్టు తీర్పు వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణ వాదనను స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. మాల మహానా డు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు.

సగరులను 'బీసీ-ఏ'లోకి చేర్చాలి

ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆర్థికంగా, రాజకీయంగా విద్యాపరంగా వెనుకబడిన సగరులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సగర సంఘం రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.... కులవృత్తులపై ఆధారపడిన వారికి ప్రభుత్వం స్కిల్ డవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా శిక్షణ తరగతులను ఏర్పాటు చేయాలని కోరారు. వృత్తులు అంతరించిపోకుండా ప్రభుత్వం తగిన సహకారం అందిస్తూ సంక్షేమ పథకాలను అందించాలన్నారు.

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... పాత పద్ధతులు కాకుండా వృత్తులకు ఆధునిక పరికరాలు అందిస్తూ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాలలో రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లుగా సగరులకు అన్ని అవకాశాలు కల్పించాలన్నారు.
- సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో సగరులను బీసీ-డీలో ఉంచి మాకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చని పక్షంలో ఉద్యమాలను బలోపేతం చేస్తామని హెచ్చరించారు. విద్యా, రాజకీయ, ఉద్యోగ రంగాలలో సగరులకు ప్రభుత్వం తగిన అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం సుమారు 300ల మంది సగర విద్యార్థులను ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు.
- ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, సగర సంఘం గౌరవ అధ్యక్షులు హరికృష్ణ, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ మారుతీ, ప్రధాన కార్యదర్శి సత్యం, కోశాధికారి కుమారస్వామి, మహిళా సంఘం అధ్యక్షురాలు ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.



సగర మహాసభలో అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, వకులాభరణం కృష్ణమోహన్ తదితరులు

రామ రామ రామ ఉయ్యాలో..



బతుకమ్మతో ఆమ్ ఆద్మి పార్టీ మహిళా విభాగం నేతలు

కవాడిగూడ: ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆప్ రాష్ట్ర కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు డీజే పాటలను అనుకరిస్తూ ఆట పాటలతో స్టెప్పులు వేసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. ఆప్ మహిళా విభాగం అధ్యక్షులు హేమా జిల్లోజు, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునా గౌడ్, ఆప్ డాక్టర్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ లక్ష్యా, నేతలు సుధారాణి, అపసా సలామ్, పరహత్ ఉన్నీసా, మౌనిక తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయం ఉట్టిపడేలా ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఆప్ తెలంగాణ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాములు గౌడ్, నేతలు అబ్దుల్, సాదిఖ్, కలీం బాబా, విజయ్ మల్లంగి, శివాజీ, దర్శనం రమేష్ పాల్గొన్నారు.

జాతీయ పక్షి.. దారితప్పి!

- జనారణ్యంలోకి వచ్చిన మయూరం
- ప్రథమ చికిత్స చేసి కేబీఆర్ పార్క్‌కు తరలింపు

చిక్కడపల్లి: అరణ్యంలో ఉండాల్సిన జాతీయ పక్షి నెమలి జనారణ్యంలోకి రావడంతో అందరూ ఆశ్చర్యపోయారు. సోమవారం మధ్యాహ్నం అశోక్‌నగర్‌లోని వాటర్ ట్యాంక్ పక్కన ఆర్‌కే మ్యాన్షన్ దగ్గర నెమలి పడి ఉన్న విషయాన్ని వాచ్‌మెన్ శంకరయ్య గమనించాడు. దాని కుడి కాలికి గాయం కావడంతో ప్రథమ చికిత్స చేసి అటవీ, పోలీసు శాఖల అధికారులకు సమాచారం అందించాడు. కేబీఆర్ పార్క్‌కు తీసుకువెళ్లి అక్కడ ఉన్న నెమళ్ల సంరక్షణలో వదిలి వేశారు. అయితే నెమలి ఓయూ, ఆర్టీసీ కాలనీ లేదా పీఅండ్‌టీ కాలనీ నుంచి వచ్చి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కరోనా సమయంలో చిక్కడపల్లిలోని పీపుల్స్ పార్క్‌లో నెమలి పూరివిప్పి గంట పాటు కనువిందు చేసిన విషయం విదితమే. అప్పట్లో 'సాక్షి'పత్రికలో ఈ వార్త ప్రచురితమయ్యింది.



అశోక్‌నగర్‌లో నెమలికి ప్రథమ చికిత్స చేసిన వాచ్‌మెన్ శంకరయ్య

అమెరికా అండతో పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు

చిక్కడపల్లి: అమెరికా అండతో పాలస్తీనాపై ఇజ్రాయెల్ అమానుష దాడికి పాల్పడుతోందని వామపక్షాల పార్టీల నేతలు సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీజీ నర్సింహరావు మాట్లాడుతూ.. అమెరికా సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయెల్ చేస్తున్న దుర్మార్గాలు ప్రపంచ మానవాళికి వినాశనంగా మారిందన్నారు. పాలస్తీనాపై దాడులను అపాలంటూ ఐక్యరాజ్య సమితి తీర్మానాలు చేసినా ఇజ్రాయెల్ పటిటంచుకోవడం లేదన్నారు. అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేసిందన్నారు. ఇజ్రాయెల్ దుర్మార్గాలకు వ్యతిరేకంగా విశాల ఉద్యమాన్ని నిర్మిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్ పేర్కొన్నారు.



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు